కథానిక:

# యువ హృదయం

పల్లని పిల్లగాలి ముద్దులు మనసుల నాహ్లాదపరుస్తున్న సాయంసమయం. అప్పుడే అంబరవీథి పడమటి కొండల గర్భంలో కలియబోతున్నాడు భాస్కర్ చేతిలోని పుస్తకాలతో కాలేజి నుంచి యింటికి వస్తున్నాడు. తీయని ఆలోచనలు తరంగాలలో తేలియాడుతూ యేకాగ్రంగా నడచి వస్తున్నాడు.

ఇంతలో అతని స్నేహితుడు రమేష్ వెనుక నుండి వచ్చి 'అరే భాస్కర్! ఏమిటలా హుషారుగా వెళ్ళుతున్నావ్'... అంటూ వీపుపై తట్టాడు.

అప్పుడే తేరుకొన్న భాస్కర్ సమాధానంగా 'ఏమీలేదురా యీ రోజు యింటిదగ్గర కొంచెం పనుంది వస్తానురా' అన్నాడు.

'ఏమిటో చెప్పకూడదా?...'

'ఏదో ఒకటి పనుందని చెప్పానుగా...' విసుగుని కనబరిచాడు.

'సరె! ఏదో తొందరపడుతున్నట్టున్నావ్ వెళ్ళిరారా' అంటూ రమేష్ సెలవు దీసుకొని నిష్క్రమించాడు.

భాస్కర్ వేగంగా యింటికి చేరుకొన్నాడు. తన ఆలోచనావళికొక రూపాన్నివ్వటానికి ప్రయత్నిస్తున్నాడు. పడక కుర్చీలో పండుకుని తలం విన్నది నిజమేనా? అని తనను తానే ప్రశ్నించుకోసాగాడు. తన మనసంతా పక్కగా ఉన్న ఖాళీ వాటా పైనే లగ్నమయింది. ఒకవేళ నిజమైతే వాళ్ళకు ఒక చక్కని అమ్మాయి వుండాలి. లేకుంటే అది వాళ్ళకు యివ్వనీకుండా చేయాలి. అందుకే తా నేదో గొప్ప పనుందని చెప్పి త్వరగా యింటికి చేరాడు. ఇంకా యెవరూ వచ్చిన జాడలు కన్పించలేదు. చీకటి పడింది. భోజనము చేసి పండుకొన్నాడు. ఏదో చదవాలని విఫలయత్నం చేస్తూ వున్నాడు. కాని మనస్సు పుస్తకంపై లగ్నమగుటలేదు. యేదో మనసులో చిరాకుగా వుంది. పక్క వాటాలోనికి అద్దెకువచ్చే అమ్మాయిపైనే తీవ్రమైన ఆలోచనలు చెలరేగుతున్నాయి. నెమ్మదిని ఆలోచనల అంతరము నిద్రపోయాడు.

♦ ♦ ♦

'ఏమండీ! యీ యింటి యజమాని గారు లేరా?' సుస్వర క్రొత్తగొంతుక వినిపించింది.

'లేరండీ! మా నాన్నగారు బజారుకెళ్ళారు. కూర్చోండి, మీకేం కావాలి?...' భాస్కర్ ప్రశ్నించాడు.

"సుప్రభాతమ్"

ఆయన కొంచెం మాటకారి. అందువలన తన చరిత్రంతా చెప్పుకొన్నాడు.

'అబ్బాయీ! నా పేరు రంగనాథం. నేను యీ వూరిలో యిన్సూరెన్సు కంపెనీకి యేజెంటుగా వచ్చాను. మీ యింట్లో ఒక ఖాళీవాటా వుందని తెలిసి నాకు అద్దెకిస్తారేమోనని వచ్చాను' అంటూ ఆగిపోయారు.

భాస్కర్ మనస్సు చివుక్కుమంది. అనుకున్న వుపద్రవం రానేవచ్చింది. ఆలోచనలో పడ్డాడు. యిన్సూరెన్సు యేజెంటుట. సంసారముందో లేదో?... ముఖ్యంగా యీయన గారికొక అందమైన అమ్మాయి వుందోలేదో ఎలా తెలుసుకోవడం. అడిగేస్తే. అడిగితే అమర్యాదగా వుంటుంది. పైగా మరభి ప్రాయంతో తిరిగి రాకుండా పోవచ్చు. భాస్కర్ కొకాకొక ఆలోచన తట్టింది. సర్వవిధాలా అదే శ్రేయస్కరమనుకొన్నాడు.

'ఫామిలీయేనా సార్?' ఇప్పుడైనా తెలుస్తుందికదా అని తన తెలివికి తానే సంతోషించాడు.

రంగనాథంగారు యెప్పుడైనా తెలుస్తుంది కదామనో భాస్కర్ ఉపాయం ఫలించో 'అవును బాబూ! ఫామిలీయే మా అమ్మాయి స్త్రీల కళాశాలలో బి. యస్ సి. చదువుతూంది. మా అబ్బాయి ప్రైవేటుగా మెట్రిక్ పరీక్షకు వెళ్ళుతున్నాడు. ఇదీ మా సంసారం. మరి యింటిసంగతేమంటారు?' అన్నారు

'సరేనండి మా ఫాదర్‌తో చెప్తాను. రేపు రండిసార్' భాస్కర్ మనస్సు ఉత్సాహముతో గంతులువేస్తుంది.

'మీ రలాగైనా చెప్పి మాకీ యిల్లిప్పించాలి. లేకుంటే చాలా యిబ్బంది పడవలసి వస్తుంది. ఇంతకీ అద్దెంతబాబూ?' రంగనాథంగారు ప్రశ్నించారు.

'సరేసార్ మీరు రేపేవచ్చి చేరవచ్చు. అద్దె అలభైరూపాయలు'

'వస్తాబాబూ'

'మంచిది వెళ్ళిరండి'

రంగనాథంగారు వెళ్ళిపోయారు. భాస్కర్ ఆలోచనలు అమితవేగంగా పరుగెత్తుతున్నాయి. ఆ అమ్మాయి యెలావుంటుంది? బాగానే వుండొచ్చు. అందంగావుంది గనుకనే మా కాలేజీలో చేర్పిస్తే 'మగపిల్లలు గోల చేస్తారని ఆ అందాల సుందరి కన్నెను స్త్రీల కళాశాలలో జేర్పించి వుంటారు. లేకపోతే అక్షరమైనా సరిగా చెప్పని ఆ కళాశాలలో యెందుకు జేర్పిస్తారు?... ఆ అమ్మాయి బి.యస్.సి. చదువుతుందంటే కనీసం పదునెనిమిది యేండ్లు నిండు జవ్వని కావచ్చు. ఒకవేళ తెలివిగలదై త్వరగా పైక్లాసులకు వచ్చిందనుకున్నా పదునారేండ్ల పసిడి యౌవ్వనపు బంగారు బొమ్మ కావచ్చు. అంతకన్నా తక్కువ వయస్సుండటం అసంభవం.

ఉదయమే రంగనాథంగారు యింట్లో చేరిపోయారు. సామానంతా సర్దుకొంటున్నారు. ఉదయం తొమ్మిదిగంటలు కాలేదింకా. భాస్కర్ పరిశుభ్రంగా తయారయి కాలేజికి వెళ్ళాలని తయారయ్యాడు. కాని ఆ అమ్మాయినిచూచి వెళ్ళుదామనిపించి వరండాలోనే కూర్చున్నాడు. కాని యెంతసేపటికి ఆమె రాకపోయేటప్పటికి కొంచెం విసుగుజెందాడు.

(మిగతా 22 వ పేజీ)

(7 వ పేజీ తరువాయి)

ఆప్పుడే ఆ అమ్మాయి చేతిలో పుస్తకాలతో వయ్యారంగా నడుచుకుంటూ కాలేజీకి బయలుదేరింది. 'అప్సరసల్నైనా మించిన అందం. హంసనడక' అనుకున్నాడు భాస్కర్ మదిలో. వెంటనే తనుకూడా బయలుదేరాడు. ఆమెను పలుకరించాలని వెంటనే నడవసాగాడు. కాని సమీపించేసరికి ధైర్యము లేకపోయింది. అలాగే స్త్రీల కళాశాలవరకు ఆమె వెనుకనే వెళ్ళాడు. ఆమె కాలేజీ గేటులోపలికి పోతూ, పోతూ వెనుదిరిగి చూచి చిరునవ్వు నవ్వింది.

భాస్కర్ హృదయం మంచులా ద్రవించింది. సాయంత్రం ఆ అమ్మాయి పేరు కనుక్కోవాలనుకున్నాడు. కాలేజీకి వెళ్ళాడన్న మాటేగాని క్లాసులో కూర్చుండ బుద్ధి కాలేదు. ఆ రోజంతా అన్యమనస్కంగా గడిపాడు. సాయంత్రం చివరిక్లాసు యెగగొట్టి స్త్రీల కళాశాల ముందు నిలుచబడి ఆమెకై నిరీక్షించసాగాడు.

కాలేజీ వదిలారు. ఆ అమ్మాయి బయటకు వచ్చింది. రాగానే చిరునవ్వుతో పల్కరించింది. జవాబుగా నవ్వబోయి విఫలుడయ్యాడు. తన్ను తానే నిందించుకోవలసినంత దుర్గతిపట్టింది. సరే యేమైనా కానీ ఆ అమ్మాయిని పలుకరించి పేరు తెలుసుకోవాలని హృదయం ఆరాటపడింది. వెంటనే ఆమె ననుసరించి నడక సాగించాడు.

కాని ఆమెను పల్కరించేందుకు ధైర్యం లేకపోయింది. ఇల్లు చేరారు. ఆమె తనవాటాలోనికి వెళ్ళిపోతూ మరలా చిరునవ్వునవ్వింది. భాస్కర్‌కు యెక్కడలేని వుక్రోషం వచ్చింది తన్నిలా నవ్వులతో ప్రేరేపించకపోతే తన మనసులో మాట చెప్పకూడదు.

అయినా స్త్రీ సహజంగా సిగ్గుపడుతుందంటారు. ఇలాంటి విషయాల్లో పురుషుడే ముందంజవేసి కార్యం నెరవేర్చుకోవాలిగాని భీరువులా వెనుకంజవేయకూడదు, కాని తనకా అవకాశాన్నివ్వకుండా పోతుందిగదా. యేమిటి చేయటం. ఒకవేళ నన్ను ప్రేమించటం లేదేమో అనుకొందామంటే నన్ను చూచి నవ్వుతుంది, కాని ఎలా పలుకరించాలో, ఎలా ఆమెకు తనకోరిక నివేదించాలో అర్థం కావటంలేదు. తప్పకుండా రేపు ఆ అమ్మాయితో మాట్లాడి తన హృదయంలో దాగిన అగ్నిగుండాన్ని బద్దలు చేయాలి.

రాత్రంతా కలత నిద్రతో, విపరీతమైన ఆలోచనలతో గడిపివేశాడు. యేదియెలా జరిగినా తానామెను ప్రేమించిన విషయం మాత్రం సత్యం. కాని ఆమె ప్రేమించిందో, లేదో, నిర్ధారణగా తెలియదుగాని అలానే భావిస్తున్నాడు.

తెల్లవారింది. మామూలుగా యిద్దరూ కాలేజీకి బయలుదేరారు. ఆమెను పలుకరించాలనే దృఢనిశ్చయాని కొచ్చాడు. కాని ఆమె అనె అసహ్యంగా మాట్లాడి నడిబజారులో తన పరువు తీస్తుందేమోనని భయంగా వుంది. అయినా పురుషుడు గనుక తానే ముందు పలుకరించాలని నిశ్చయించుకున్నాడు.

'ఏమండీ! మిమ్మల్నే...' అంటూ నసిగాడు.

'ఏమిటండి...' చాలా సౌమ్యంగా వినిపించిందామె సమాధానం. కాని భాస్కర్ తడబడ్డాడు. తరువాత యేమి మాట్లాడాలో అర్థము కాలేదు. రెండు నిముషముల తరువాత తేరుకొని,

'మీరు యేం చదువుతున్నారు...'

'బి. యస్. సి. సెకండ్ యియర్...' మరి మీరు...'

'నేనుకూడా సెకండ్ యియరే. మీ గ్రూపు...' ధైర్యం కలిగింది.

'బి. సి. జడ్. మరి మీ...'

'నాదికూడా అదే...' అంతలోకే కాలేజీ గేటు సమీపించింది. ఆమె వెళ్ళబోతూ వుంది.

'ఇంతకీ! మీ పేరు...' అంటూ హీనస్వరంతో ప్రశ్నించాడు భాస్కర్.

'సుహాసిని...' అంటూ ఆమె మధుహాసం చేస్తూ వెళ్ళిపోయింది.

భాస్కర్‌కు మిక్కిలి ఆనందం కలిగింది. ఎవరెస్టు శిఖరాన్నధిగమించినంత సంబరపడ్డాడు. ఆ పేరును తలుచుకొని మురిసిపోయాడు. 'సుహాసిని, సుమధురభాషిణి, మంజులమధుర ప్రణయ పట్టమహిషీ!' అనుకుంటూ ఉత్సాహంగా కాలేజికి వెళ్ళాడు.

ఆ సాయంత్రం సుహాసిని వెనుకవైపునున్న చిన్నతోటలో కూర్చొని నవల చదువుకుంటూ వుంది. భాస్కర్ అటువైపువెళ్లాడు.

'రండి! రండి!! కూర్చోండి.' ఆమె ఆహ్వానించింది. భాస్కర్ వెళ్లి కూర్చున్నాడు.

క్షణంసేపు యిరువురిమధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది. ఇంతలో నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ భాస్కర్ ఆమెను ప్రశ్నించాడు.

'మిమ్మల్నొక టడగాలనుకుంటున్నాను. యేమంటారా ?'

'ఏమిటది ?'... బొటనవ్రేలు నేలపైరాస్తూ ప్రశ్నించింది సుహాసిని.

'ప్రేమభిక్ష. నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నన్ను గ్రహించమని వేడుకొంటున్నాను...' అన్నాడు భాస్కర్. ఆమె సిగ్గుతో తల మరోప్రక్కకు త్రిప్పుకొని లోపలికి వెళ్ళిపోయింది.

రోజులు క్షణాల్లా గడచిపోతున్నాయి. ఇద్దరూ ఒకరిభావాలు వేరొకరికి చెప్పుకుంటూ కాలాన్ని హాయిగా గడిపివేయసాగారు. యీ రీతిగా ఆరుమాసాలు కాలహేలలో కలసిపోయాయి. ఇంతలో రంగనాథంగారికి ట్రాన్స్‌ఫర్ అయింది, దానితో వారికి చెడురోజులు దాపురించినట్లయింది. వారి ఆశాసౌధాలు కూలిపోసాగాయి. రంగనాథంగారు వెళ్ళిపోవాలనుకుంటున్నారు. ఆ సాయంత్రం ఇద్దరూ కలిసారు.

'సుహాసినీ! నీవుకూడా నన్ను వదలి వెళ్ళిపోతావా ?' బాధాపూరితమైన కంఠంతో ప్రశ్నించాడు.

'వెళ్ళక తప్పదు' నిరుత్సాహంగా జవాబు చెప్పింది.

'మనం వెంటనే మీ నాన్నగారితో చెప్పి పెండ్లి చేసుకోకూడదా ?'

'లేదు, యీ పరిస్థితుల్లో మన పెండ్లి జరుగదు. మాకు యిప్పటికే చాలా అప్పు లున్నాయి. అవి ఒక సంవత్సరంతో ఆఖ రవుతాయి. అదియునుగాక మా పెదనాన్న గారింట్లో మా అక్కయ్య వుంది. ముందు ఆమె పెండ్లి జరగకుండా నా పెళ్ళికి సుత రామూ యిష్టపడరు.'

'అయితే! సంవత్సరంపాటు నేను నిరీ క్షించక తప్పదా సుహాసినీ?' నిరాశాపూరి తుడై మాట్లాడుతున్నాడు భాస్కర్.

'తప్పదు' యిప్పటికే అలస్యమైంది. నేను వెళ్తున్నాను. మీరు తప్పక వుత్తరాలు రాస్తూ వుంటారుకదూ ?'...అంటూ కన్నుల్లో నీరె నింపుకొన్నది సుహాసిని.

'తప్పకుండా రాస్తాను. నిన్ను మరచిపో గలనా సుహాసినీ!'

'సరే వస్తాను'

'వెళ్ళిరా' ఆమె వెళ్ళిపోయింది. భాస్కర్ హృదయం శూన్యమైంది. గదిలోకి వచ్చాడు. భగ్నప్రేమకునిలా సంవత్సరంపాటు వీధుల వెంట బికారిలా తిరగాడు. ఆమె తన స్మృతి పథంలో మెదిలి కలవరపరచసాగింది. పండు కొన్నాడు. కాని ఆమె తన కనుపాపలలో నిలిచి మరువనీకుండా చేస్తుంది. 'సుహాసినీ! నిన్నెలా మరచిపోగలను. సంవత్సరంపాటు నే నెలా మనిషిలా మనగలను. సుహాసినీ! యేదైనా మార్గం ఆలోచించి త్వరలో నన్ని చెరసాలనుండి విడుదలచేయి. నేనీ యేకాం తాన్ని భరించలేను సుహాసినీ! భరించలేను!'

◆ ◆ ◆

'ఏమిటి బాబూ! పలువరిస్తున్నావు' అంటూ భాస్కర్‌ను నిద్రలేపిందివారి అమ్మ గారు.

'నా...' అంటూ లేచాడు.

'సరేలే బాబూ! లేచి కాలకృత్యాలు తీర్చుకో' అని వెళ్ళిపోయింది. చిరునవ్వు నవ్వుకుంటూ దొడ్డివైపు వెళ్ళాడు. బోసిగా నున్న ఖాళీవాటా పక్కుమని నవ్వింది. తనుకూడా నవ్వకుండా వుండలేకపోయాడు.




స్వాతంత్ర్యం అపదలో వుంది,
నాయకుల్లా దాన్ని పరిరక్షించండి
—జవహర్‌లాల్ నెహ్రూ

రక్షణ కృషిలో మీ కర్తవ్యం
మన స్వాతంత్ర్యమును పరిరక్షించుకోవాలంటే, సంపూర్ణ శక్తియుత కృషి, క్రమశిక్షణ, త్యాగ నిరతి చాలా అవసరం, కార్యదీక్షతో పనిచేయుటం ద్వారాను, ఉత్పత్తులను పెంచడం ద్వారాను మీరు రక్షణను పటిష్టం చేయుగలరు.
మీ క్రమశిక్షణే భారతదేశానికి శక్తి